# పాపం కోటేసు!

తెల్లవారితే ఎలక్షన్లు...

ఆరాత్రి కోటేసు కంటికి కునుకే రాలేదు...

"తెల్లారితే ఎలచ్చను!" అని కనీసం వందసార్లైనా మనసులో అనుకున్నాడు...

'ఎప్పుడు తెల్లవారుతుందా' అని తూర్పు దిక్కువైపు చూస్తూ పడుకున్నాడు.... అతని చూపుల్లో పదునైన ఆలోచనలు వున్నాయి... ఆ ఆలోచనల్లో పదేళ్ళ గతం వుంది!

కోటేసుకి తల్లీతండ్రీ లేరు....వాడి పదో నెలలోనే తల్లిపోయింది. పదేళ్లు వచ్చాక తండ్రి పోయాడు...పోతూ పోతూ కోటేసుని పెద్దకాపు కాళ్ళ దగ్గర పడేసి మరీపోయాడు.

★ ★ ★

పెద్దకాపు రామనాథానికి ఆ ఊళ్ళో పెద్ద ఇల్లుంది. చెరువుగట్టు నానుకుని బోలెడంత మాగాణీ వుంది...పదో పన్నెండో ఒంగోలు గిత్తలున్నాయి... ఎనిమిదో తొమ్మిదో ముర్రా గేదెలున్నాయి. రెండో మూడో సీమకుక్క పిల్లలున్నాయి... వాటన్నింటి సంరక్షణ భారాన్ని మోయటానికి నలుగురయిదుగురు మనుషులున్నారు.

రామనాథం ఇంటికి వచ్చేసరికి కోటేసు పదేళ్ళ కుర్రాడు...బరువు పనులు ఎలాగా చేయలేడని, వాడికి చిన్న చిన్న పనులు చెప్తూండేవాడు రామనాథం...

కుక్కపిల్లకు పాలుపొయ్యటం, పశువులకు గడ్డివెయ్యటం, ఇంటి వెనుక తోటలో వున్న పూలమొక్కలకు సాయంత్రం పూట నీళ్ళుపెట్టటం, రామనాథం ఊళ్ళోకి వెళ్ళేముందు చెప్పులూ, చేతి కర్రా అందించటం, ఆయనగారికి రాత్రిళ్ళు కాళ్ళుతొక్కటం, ... ఇలాంటి పనులన్నీ చాలా శ్రద్ధగా చేసేవాడు కోటేసు...

కోటేసు రామనాథం ఇంటికి వచ్చిన ఏడాదికే ఎలక్షన్లు జరిగాయి...రామనాథం కూడా అసెంబ్లీ మెంబరుగా ఎలక్షన్లో పోటీ చేశాడు.

ఎలక్షన్ల ముందు జరిగిన హడావిడి చూస్తుంటే ఎంతో వింతగానూ సరదాగానూ అనిపించేది కోటేసుకి...ఎలక్షన్ల ప్రచారంలో అలసట కూడా లేకుండా తిరిగేవాడు... అందరికంటే ముందు నిలబడి "రామనాథంగారికే మీ ఓటు" అంటూ హుషారుగా నినాదాలు చేసేవాడు.

ఎలక్షన్లంటే ఏమిటో అసలే తెలియకపోయినా - అయ్యగారు నెగ్గితీరాలన్నది వాడి ఆరాటం!....

రామనాధం చెప్పినమీదట ఎవరెవరికో రూపాయలు పంచిపెట్టి వచ్చేవాడు...కొంత మందిని కల్లుపాకలకు తీసుకెళ్ళి వాళ్ళ చేత తాగించేవాడు... అలాంటి పనులు చేస్తున్నప్పుడు వాడికెంతో ఆనందంగా వుండేది!... అలాంటి ముఖ్యమైన పనులు కూడా రామనాధం తనకు పురమాయిస్తున్నందుకు గర్వించేవాడు.

మొత్తానికి ఆ ఎలక్షన్‌లో రామనాధం గెలిచాడు...అప్పుడు కోటేసుకి కొత్త బట్టలు కుట్టించాడు..అలా గెలిచినందుకు రామనాధానికి ఒరిగేదేమిటో ఆ పదవిలో వుండి రామనాధం ప్రజలకు చేసేదేమిటో - ఇవేమీ అర్ధం చేసుకునే వయసు కాకపోయినా - కొటేసు మాత్రం కొత్త బట్టలు తొడుక్కుని పిచ్చిగా మురిసిపోయాడు.

"అయ్యగారు దేవుడు" - అని కమతగాళ్ళందరికీ చెప్పాడు.

కానీ దేవుడులాంటి ఆ మనిషే - గౌరికి అన్యాయం చేయటం తన కళ్లారా చూసినప్పుడు.-

"ఛీ...! అయ్యగారసలు మనిషి కాదు...రాక్షసుడు" - అని మనసులోనే అనుకున్నాడు.

ఆరోజు...!

పొద్దు పొడవటానికి వీల్లేనంతగా ఆకాశాన్ని నల్లమబ్బులు కమ్ముకున్నాయి... వర్షం వెర్రెత్తినట్టు కురుస్తోంది...

గడియారాలు లేనివాళ్ళకి 'టై' మెంతయిందో కూడా తెలియటంలేని వాతావరణంలో 'టైం' తో నిమిత్తం లేకుండా తాగుతున్నాడు రామనాధం... సాధారణంగా వారానికి నాలుగయిదు సార్లయినా, పొద్దు వాలిపోగానే సీసాల ముందు కూర్చునే రామనాధం - అలా వర్షం వస్తున్నప్పుడు పొద్దస్తమానూ తాగుతాడు.

అలా రామనాధం తాగేటప్పుడు కారం జీడిపప్పూ, ఉల్లిపాయముక్కలూ, నిమ్మకాయ చెక్కలూ సోడాలూ - ఇలాంటి వాటినన్నింటినీ కోటేసే 'సప్లయ్' చేస్తూంటాడు.

ఆ రోజున కూడా - రామనాధం గదిలో ఓ మూల గోడను ఆనుకుని కూర్చున్నాడు కోటేసు... అడిగినప్పుడల్లా, అవసరమైన వాటిని అందిస్తున్నాడు... ఉండి ఉండి రామనాధంవైపు చూస్తున్నాడు... తాగుడు మంచిది కాదని ఓసారి ఎవరో అంటూంటే కోటేసు విన్నాడు.

"అయినా అయ్యగారు ఇలా రోజూ ఎందుకు తాగుతారో మరి?' అని కూడా అనేక

సార్లు అనుకున్నాడు.

"ఒరేయ్ కోటిగా!" అప్పటికి అరసీసా ఖాళీ చేసిన రామనాధం పిలిచాడు.

దగ్గరకెళ్ళి నిలబడ్డాడు కోటేసు...

"గౌర్ని ఓసారి తీసుకు రారా"!- ముద్దగా వున్నాయి రామనాధం మాటలు...

"ఇంత వర్షంలోనా?" - క్షణం తటపటాయించి అన్నాడు కోటేసు.

"ఇంత వర్షం కనకనే తీసుకరమ్మంటున్నాను... గొడుగేసుకుని వెళ్ళు... తొరగా వెళ్ళొచ్చెయ్!"

కోటేసు మరేం మాట్లాడలేదు...గొడుగు తీసుకుని వెళ్ళిపోయాడు... 'అంత వర్షంలో రామనాధానికి గౌరి అవసరం ఎందుకొచ్చిందా' అని దారి పొడుగునా ఆలోచిస్తూనే వున్నాడు.

గౌరి కనకడి పెళ్ళాం ..! ఆ మధ్యనే వాళ్ళ పెళ్ళయింది. పెళ్ళయిన తర్వాత కనకడు గౌరిని రామనాధం దగ్గరకు తీసుకొచ్చాడు...

"మా అయ్యగారు! కాళ్ళకు దణ్ణవెఁట్టు" - అని గౌరి చేత మొక్కించాడు.

అపుడు రామనాధం తన లాల్చీ జేబులోవున్న పాతిక రూపాయలు తీసి కనకడి చేతిలో పెట్టాడు.

"ఇవాళ నువ్ పనిలోకి రానక్కర్లేదులే కానీ - వెళ్ళి పండగ చేసుకోండి" - అంటూ పంపించేశాడు. ఆ తర్వాత కొద్ది రోజులకే గౌరిని కూడా తనింట్లో పనికి పెట్టుకున్నాడు.

రామనాధం పెళ్లాం సుబ్బలక్ష్మి ఒట్టి అమాయకురాలు...దైవభక్తి మరీ ఎక్కువ... పూజలన్నా పునస్కారాలన్నా చాలా మక్కువ... అందుకే యాత్రా స్పెషల్ రైలు ఏదో వెడుతూంటే, నాలుగు రోజుల క్రితమే సుబ్బలక్ష్మి కూడా బయల్దేరి వెళ్లింది...

ఒంటరిగా వుంటున్న రామనాధానికి ఆరోజు వర్షం కూడా కలిసొచ్చేసరికి తుంటరి కోరికలు జివ్వుమన్నాయి... అడపాదడపా కంటపడే గౌరి వయసూ వంపులూ హఠాత్తుగా గుర్తుకొచ్చి, తాగింది ఒంటబట్టకుండా చేశాయి... కనకడు ఊళ్ళో కూడా లేడు...ఎరువుల బస్తాలు వేసుకురమ్మని రామనాధమే కనకడ్ని టౌనుకి పంపించాడు. వాడు రెండు రోజుల దాకా రాకపోవచ్చు.

"గౌరి ఈ పాటికి వచ్చేస్తూ వుండాలి" - గ్లాసులో వున్న బ్రాందీని ఒక్క గుక్కలో తాగేసి అనుకున్నాడు రామనాధం...

అలా అనుకున్న అయిదు నిముషాలకే - గౌరి వచ్చింది... గొడుగులో వచ్చినా బాగా తడిసిపోయింది...తడిసిన చీరలోంచి ఆమె ఒంటి వంపులు రామనాధం కంటికి మరింత నదరుగా కనిపిస్తున్నాయి...

లోపలకు వచ్చిన గౌరి రామనాధాన్నీ, అతని ముందున్న సరంజామానీ చూసి బిత్తరపోయింది...

తాగుడు ఎలాంటిదో గౌరికి తెలుసు!... తాను తాగకపోయినా అప్పుడప్పుడు తాగొచ్చే కనకడు తన ఒంట్లో ఎముకల్ని ఎలా చితక్కొడతాడో అనుభవముంది....

ఆ అనుభవం గుర్తుకురావటంతో - గౌరి మనసు ఏదో కీడును శంకించింది.

"రావే గౌరీ ! ఇలా కూర్చో!" తనకు పక్కనే వున్న కుర్చీ చూపించాడు రామనాధం.

పరిస్థితి అర్ధం చేసుకుంది గౌరి... బెదురు బెదురుగా చూస్తూ నిలబడింది...

"ఫరవాలేదు రావే! ఇంట్లో ఒక్కడికీ ఏం తోచక, సాయం వుంటావని కబురెట్టాను" - వెకిలిగా నవ్వేస్తూ అన్నాడు.. అంతలోనే గొడుగు ముడిచి మూలను బెట్టి - తడిసిన తల తుడుచుకుని అక్కడకు వచ్చాడు కోటేసు.

"ఒరేయ్ కోటిగా! ఇంక ఇవన్నీ గౌరి చూసుకుంటుందిలే కానీ - నువ్వెళ్ళి హాల్లో కూర్చో" - మళ్ళీ సిగరెట్టు వెలిగించుకుని ఆర్డర్ వేశాడు రామనాధం.

కొత్తగా కనిపిస్తున్న రామనాధాన్నీ - బెదురుచూపులు చూస్తున్న గౌరినీ ఓసారి చూసి హాల్లోకి వెళ్ళిపోయాడు కోటేసు! అక్కడున్న బల్లమీద కూర్చున్నాడన్న మాటేగానీ, ఆలోచనలన్నీ రామనాధం చుట్టూ తిరుగుతూనే వున్నాయి...

"కూర్చోమన్నపుడు కూర్చోవాలి! నా దగ్గర బెట్టేమిటే పిచ్చిమొహమా?... నీ మొగుడికి నేను దేవుడ్ని... అందుకనీ నీకూ నేను దేవుణ్నే!... నువు నాకు పూజ చేయాలి, కాళ్ళకు మొక్కాలి... నీకు వరాలిస్తాన్లే. ఇవిగో..! ఇవుంచు! ఎంతో చూశావా? మూడు వంద కాగితాలు... తీసుకో...రా!...రమ్మంటే! నేనెవర్నో తెలుసా? ఎమ్మెల్యేని. మళ్ళీ ఎలక్షన్లకి మంత్రి నయిపోతాను... అప్పుడు నీకు మేడ కట్టిస్తాను... తెలుసా!" --పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్నాడు రామనాధం.

"ఒద్దు బాబుగోరూ ! నేనసుమంటిదాన్ని కాను. తవరు మాకు దేవుడులాంటోరు!" - బ్రతిమలాడుతోంది గౌరి.

హాల్లో కూర్చున్న కోటేసుకి వాళ్ళ మాటలన్నీ వినిపిస్తూనే వున్నాయి...ఆ మాటల్లోని అర్ధాలు కొద్దికొద్దిగా స్ఫురిస్తూంటే-

"ఛీ! అయ్యగారు అసలు, మనిషి కాదు! రాక్షసుడు." - అనుకున్నాడు... కోపంతో వాడి పిడికిళ్ళు బిగుసుకున్నాయి... అసహ్యంగా వెనుతిరిగి చూశాడు, ఆ గది తలుపులు మూసివున్నాయి...

మరో అరగంట తర్వాత ఆ తలుపులు తీసుకుని - గౌరి బయటకు వచ్చింది. అమ్మవారు పూనిన ఆడమనిషిలా కనిపించింది...నల్లగా వున్న ఆమె నున్నటి చెంపలమీద గాట్లు కనిపిస్తున్నాయి... ఆ గాట్లు రక్తంతో కలిసిపోయి మరీ ఎర్రగా వున్నాయి...

ఆమెను పలకరిద్దామనుకున్నాడు కోటేసు. కానీ అందుకు అవకాశం ఇవ్వకుండానే గబగబా అడుగులు వేస్తూ - వర్షంలో తడుస్తూ వెళ్ళిపోయింది గౌరి.

"ఒరేయ్ కోటిగా" - లోపలనుంచి పిలుపు వినిపించింది. కానీ వెళ్ళాలనిపించలేదు కోటేసుకి...రామనాధం పట్ల అసహ్యం, ద్వేషం పేరుకుపోయాయి, వాడి ఉడుకు నెత్తురులో...

"కోటీ!" - మళ్ళీ పిలిచాడు రామనాధం.

వెళ్ళక తప్పలేదు...

అవునుమరి! వెళ్ళాల్సిందే! రామనాధం ఎలాంటివాడైనా ఆ ఇంటి ఉప్పూ పులుసూ తింటున్నాడు తను!... రామనాధం ప్రవర్తన తనకు నచ్చినా నచ్చకపోయినా తాను ఆ నీడలో వుంటున్నాడు... అందుకే గత్యంతరం లేక లోపలకు వచ్చాడు.

"గౌరి వెళ్ళిపోయిందా?" - రామనాధం అడిగాడు.

వెళ్ళిపోయిందన్నట్లుగా తలూపాడు కోటేసు.

"ఈ విషయం ఎవరికీ చెప్పకూడదు! తెలిసిందా? చెప్పావంటే నిన్ను గొయ్యి తీసి పాతిపెట్టేస్తాను... జాగ్రత్త!" తాగిన మైకంలో కళ్ళు బరువుగా వాలిపోతూంటే అన్నాడు రామనాధం.

"అలాగేబాబూ!" - రామనాధానికి ఎదురుగా బల్లమీదనున్న మూడు వందరూపాయల కాగితాల్నీ - ఖాళీ అయిపోయిన బ్రాందీసీసాని తదేకంగా చూస్తూ భయం భయంగా అన్నాడు కోటేసు.

అంతకు ముందువరకూ రామనాధమంటే ఎంతో భక్తిని కనబరిచే కోటేసు - ఆ సంఘటన జరిగినప్పటి నుంచీ - భక్తి బదులు భయాన్ని ప్రదర్శిస్తున్నాడు.... రామనాధం చేసే ప్రతిపనీ ఎందుకో కృత్రిమంగా కనిపిస్తోంది.

ఈలోగా మళ్ళీ మరోసారి ఎలక్షన్లు వచ్చాయి..

మళ్ళీ రామనాథం ఎలక్షన్లో నిలబడ్డాడు...అతనికి పోటీగా యీసారి మరో ముగ్గురు అభ్యర్థులు కూడా నిలబడ్డారు...ఎవరికి వారు భారీ యెత్తున ప్రచారాన్ని కొనసాగించారు...

ఎలాగైనా తాను గెలవాలనే తపనలో - ఇంటింటికీ వెళ్ళి ఓట్లిమ్మని అడుగుతున్నాడు రామనాథం... రోజుకో పేటలో మీటింగులు పెడుతున్నాడు. తన గొప్పతనాన్ని భూతద్దం పెట్టి మరీ చెప్పుకుంటున్నాడు. అవతలి పార్టీ అభ్యర్థుల గురించి అవకతవకలు మాట్లాడుతున్నాడు... అందర్నీ ఆప్యాయంగా పలకరిస్తున్నాడు.. కొందరి చేతుల్లో పాతికలూ, పరకలూ పెడుతున్నాడు... ఎందరి గొంతులకో కల్లుముంతల్ని అందిస్తున్నాడు. అయినా అక్కసు తీరక, అవతలి పార్టీ మనషుల్ని అనవసరంగా చితక్కొట్టించాడు...

ఇవన్నీ కోటేసు గమనిస్తూనే వున్నాడు.

అయినా అనాలికనుకా - ఇకముందు కూడా ఆచేతి కూడు తినాలి కనుకా - "రామనాథం గారికే మీ ఓటు" అంటూ అరుస్తున్నాడు... ఆ మాట నాలిక మీద నుంచి వస్తోందే తప్ప - ఇదివరకట్లా నాభిలోంచి రావటం లేదు... ఆ గుండె లోతుల్లో రామనాథం పట్ల కసీ, ద్వేషం కోపం పగా - ఇవే నిండి వున్నాయి...

అయినా కోటేసుకి ఎందుకో ధైర్యం వచ్చింది...

'ఈసారి అయ్యగారు ఓడిపోతారు' - అనుకున్నాడు...

'బంగారం లాంటి గౌరిని పాడుచేశాడు. అంతకుముందు జరిగిన ఎలక్షన్ల టైములో చేసిన వాగ్దానాల్లో ఒక్కటీ అమలు చేయలేదు సరికదా సిగ్గులేకుండా మళ్ళీ అలాంటి వాగ్దానాలే చేస్తున్నాడు... జనాలు అంత అమాయకులని అనుకున్నాడు కాబోలు పాపం!... పైగా అవతలిపార్టీ మనుషుల్ని అన్యాయంగా కొట్టించాడు... అందుకే రామనాథం ఈ సారి తప్పకుండా ఓడిపోతాడు...ఓడిపోవాల్సిందే...' అని కోరుకున్నాడు...

కానీ కోటేసు అంచనా తారుమారయింది. అంతకు ముందు ఎలక్షన్లలో కంటే ఎక్కువ ఓట్లు తెచ్చుకుని మరీ గెలిచాడు రామనాథం...

కోటేసుకి మతిపోయింది....అలా ఎందుకు జరిగిందో అర్థం కాలేదు.

రామనాథానికి పరపతి మరింత పెరిగింది... ఆ పరపతి పరదా ముసుగులో రామనాథం చేసే అవకతవకలను కోటేసు గమనిస్తున్నాడు.... అలాంటి మనిషికి ఓట్లువేసి గెలిపించిన మనుషుల్ని తలుచుకుని కసితీరా తిట్టుకుంటున్నాడు... ఆ యిల్లు వదిలిపెట్టి వెళ్ళిపోవాలని చాలాసార్లు అనుకున్నాడు...

"కానీ ఎక్కడికి వెళ్ళగలను?, వెళ్లి ఏం చేయగలను?, ఎలా బ్రతకగలను?

చదువూ సంధ్యా కూడా లేకపోయే!... ఎక్కడికెళ్ళినా ఇట్టాంటిపని చేసుకోవాల్సిందే కదా!" అని తనలో తానే సరిపెట్టుకున్నాడు...

మరో ఐదేళ్లు ఇట్టే గడిచిపోయాయి...

ఇంకోసారి ఎలక్షన్లు వచ్చాయి!

రామనాథం మళ్ళీ మామూలుగా ఎలక్షన్లో నిలబడ్డాడు. ఈసారి అతనికి ప్రత్యర్థులు అయిదుగురు తయారయ్యారు... ఎవరికివారే ప్రచారాలు అద్భుతంగా చేసుకుంటున్నారు.

ఈసారి ఎలక్షన్లు కోటేసుకి ఓ ప్రత్యేకతను తెచ్చిపెట్టాయి...కోటేసుకి ఓటుహక్కు వచ్చింది...ఈసారి ఎలక్షన్లో తానూ ఓటు వేయబోతున్నాడు... ఆ ఊహ కలిగితేనే ఒళ్ళంతా గగుర్పొడుస్తోంది కోటేసుకి.

తెల్లారితే ఎలక్షను.

ఆరాత్రి కోటేసుకి కంటిమీద కునుకులేదు... 'తెల్లారితే ఎలచ్చను' అని కనీసం వందసార్లైనా మనసులో అనుకున్నాడు. ఎప్పుడు తెల్లారుతుందా అని తూర్పుదిక్కువైపు చూస్తూ పడుకున్నాడు... అతని చూపుల్లో పదునైన ఆలోచనలున్నాయి. ఆ ఆలోచనల్లో పదేళ్ళ గతముంది... ఆ గతంలో రామనాథం చేసిన అవినీతి పనులు కళ్ళకు కట్టేలా కనిపిస్తున్నాయి.

'ఈ దెబ్బతో అయ్యగారు ఓడిపోవాల్సిందే... నా తడాఖా చూపిస్తాను... ఆయనగారి ఉప్పూ పులుసూ తింటున్నాను కనుక, ఆయనగారికే నేను ఓటు వేస్తానని అనుకుంటున్నాడు పాపం' - తనలో తనే గర్వంగా అనుకున్నాడు కోటేసు. .

అంతలో తూర్పున పొద్దుపొడిచింది.

గబగబాలేచి - తలస్నానం చేసి - ఉతికిన బట్టలు వేసుకున్నాడు. తలకు దిట్టంగా నూనె రాసుకుని - దువ్వుకున్నాడు. హుషారుగా ఈల వేసుకుంటూ పోలింగ్‌బూత్ దగ్గరకు వెళ్ళాడు. అప్పటికింకా అక్కడకు జనాలు చేరలేదు...

"బాబుగారూ! నేను ఓటు వెయ్యాలి" తిన్నగా లోపలకు వెళ్ళిపోయి అక్కడున్న ఓ పోలింగ్ ఆఫీసర్ని అడిగాడు కోటేసు.

"ఇంకా టైమవలేదు... ఓ గంటసేపు ఆగాలి!...బైటకెళ్ళి కూర్చో...ఎనిమిది కాగానే చెప్తాం" - అన్నాడాయన.

అసహనంగా బయటకు వచ్చి అటూ యిటూ చాలాసార్లు పచార్లు చేశాడు.

కొంతసేపు గడిచేసరికి హడావిడి ప్రారంభమయింది. ఒకరిద్దరు పోలీసులు కూడా వచ్చారు. ఓట్లు వేయటానికి వస్తున్న వారినందర్నీ వరసలో నిలబెట్టారు. సరిగ్గా ఎనిమిదయ్యే సరికి పోలింగు ప్రారంభమయింది...

కోటేసుకి కొండంత సంబరంగా వుంది!... మొదటిసారిగా ఓటు వేస్తున్న మధురానుభూతి కలిగింది.

ఓసారి కాలరు సవరించుకుని లోపలకు వెళ్ళాడు.. పోలింగ్ ఆఫీసరుకి తనపేరు చెప్పాడు...

పోలింగ్ ఆఫీసరు ఓటు కాగితాలు కోటేసు చేతిలో పెట్టి - 'ఆ కాగితం మీద అభ్యర్థులపేర్లూ, వారి వారి గుర్తులూ వుంటాయనీ తనకునచ్చిన అభ్యర్థి గుర్తు మీద రబ్బరుస్టాంపుతో ముద్ర వేయాలనీ' చెప్పాడు... ముద్రవేసిన తర్వాత ఆ ఓటు కాగితాన్ని ఎలామడిచి పెట్టెలో వేయాలో కూడా వివరంగా చెప్పాడు.

పరదాలు కట్టివున్న గదిలోకి వెళ్ళాడు కోటేసు.... అక్కడ మనషులెవరూ లేరు. బల్లమీద ఓ పెట్టె వుంది.... పెట్టెపైన సన్నంగా పొడుగ్గా స్టాంపు, స్టాంప్ ప్యాడూ వున్నాయి...

పోలింగ్ ఆఫీసరు చెప్పిన విషయాలన్నీ ఓసారి మననం చేసుకున్నాడు. ఓటు కాగితం లోకి ఓసారి నిశితంగా చూశాడు. ఏవేవో అక్షరాలు రాసి వున్నాయి. అవి అభ్యర్థుల పేర్లయి వుంటాయనుకున్నాడు. తనకి చదువు రానందుకు మళ్ళీ మరోసారి తనను తిట్టుకున్నాడు. కానీ గుర్తులు తెలుసుగా!....అన్ని గుర్తుల్నీ చూశాడు...ఏ ఏ గుర్తు ఎవరిదో తనకు తెలియక పోయినా - రామనాధం గుర్తు మాత్రం తనకు బాగా తెలుసు!...

అంతే!...

ఆ గుర్తు ఒక్కటీ ఒదిలిపెట్టేసి... తక్కిన గుర్తులన్నింటిమీదా టకటకమంటూ పిచ్చిగా ముద్రలు గుద్దేశాడు కోటేసు... కాగితాన్ని మడిచి పెట్టెలో వేసేసి - బయటకు వచ్చి హాయిగా ఊపిరి పీల్చుకున్నాడు...

"ఇక అయ్యగారి పని అయిపోయినట్టే" - అనుకున్నాడు పాపం కోటేసు!! ★

(స్వాతి మాస పత్రిక - అక్టోబర్ 78)